క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన గుమ్మడవెల్లి వాసి



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణురాజ్

మద్దిరాల : ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండ రామ్‌ను విద్యార్థి ఉద్యమ నేత బాషబోయిన వేణురాజ్ ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి



వర్ధమానుకోటలో విద్యుత్ బకాయిలు వసూలు చేస్తున్న అధికారులు

నాగారం : వినియోగదారులు విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని మండల ఏఈఈ మహేంద్రకుమార్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని వర్ధమానుకోట, ఫణిగిరి, నాగారం గ్రామాల్లో విద్యుత్ మొండి బకాయిల వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి లబ్ధిదారులు మినహాయించి ఇతర విద్యుత్ వినియోగదారులు, రైతులు బిల్లులను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫోర్‌మన్ కృష్ణారావు, లైన్‌మెన్‌లు సమ్మయ్య, సాగర్ పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం ఏఓగా గణేష్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారిగా పెందోట గణేష్ నియమితులయ్యారు. ఈయన నాగారం మండలంలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న మల్లారెడ్డి సూర్యాపేటకు బదిలీ అయ్యారు. అయితే గణేష్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

కాంగ్రెస్ నాయకుల నివాళి



జాజిరెడ్డిగూడెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తాడూరి నాగయ్య సతీమణి రజిత అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు మోరపాక సత్యం నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ కృష్ణమూర్తి, ఎల్లెంల కొమిరెల్లి, జేరిపోతుల సోమయ్య, కుంభం సత్తయ్య, బింగి కృష్ణమూర్తి, మాదగాని రమేష్ నరేష్ ఉన్నారు.

టాయిలెట్ల ధ్వంసం



వాహనం ఢీకొని కూలిపోయిన టాయిలెట్లు

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ 365బీ హైవే విస్తరణ సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండలంలోని వేల్పుచర్ల స్టేజివద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన టాయిలెట్లు ధ్వంసమయ్యాయి. ఇటీవల సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళుతున్న ఓ వాహనం అదుపు తప్పి స్టేజి వద్ద రోడ్డు పక్కన నిర్మించిన టాయిలెట్లకు ఢీకొనడంతో ధ్వంసమయ్యాయి. ఈ హైవేపై ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులు ఇక్కడ ఆగి టాయిలెట్లను వినియోగించుకునేవారు. ఇవి ధ్వంసం కావడంతో హైవే అధికారులు కొత్తగా మళ్లీ టాయిలెట్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోలీసులకు సన్మానం

నేరేడుచర్ల : ఉత్తమ పోలీస్ అవార్డులు అందుకున్న నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు, సోమవరం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణలను ఆదివారం నేరేడుచర్లలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ ఏఎస్‌ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌రావు ఇండియన్ పోలీస్ మెడల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం, గంటా సత్యనారాయణ సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తూ కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం గ్రామానికే గర్వకారణమన్నారు. సుంకరి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రావులపల్లి ప్రసాద్, కౌన్సిలర్లు సులోచన శ్రీనివాస్, వేమూరి నాగవేణినారాయణ, న్యాయవాది సుంకరి ప్రదీప్తి పాల్గొన్నారు.

నీటి వనరుల నిర్వహణకు నిధులేవి..

- గత ఐదేళ్ల నుంచి నిర్వహణ నిధులు బంద్
- కంపచెట్లతో నిండి అధ్వానంగా మారిన చెరువులు, కట్టలు



కంపచెట్లతో నిండి అధ్వానంగా మారిన జాజిరెడ్డిగూడెంలోని తీగలచెరువు కట్ట



కాసర్లపహాడ్‌లో గుంతలమయమై బురదమడుగులా మారిన కట్టదారి

అర్వపల్లి : చిన్ననీటి వనరులకు కొన్నేళ్లుగా నిధులు రాక వాటి నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రతి ఏటా చిన్ననీటి వనరుల నిర్వహణకు నిధులు రావాల్సి ఉండగా ఐదేళ్లుగా ఆ నిధులు నిలిచి పోయాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలను అభివృద్ధి చేశారు. పూడికతీత పనులు కూడా చేపట్టారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా సుమారు 85 వరకు చెరువులు, కుంటలు ఉండగా వాటిలో 70 చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ పథకం ద్వారా అభివృద్ధి చేశారు. ఇందుకోసం సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్వహణ లేక కట్టలు కంపచెట్లతో అల్లుకపోయి అధ్వానంగా మారాయి.

చెరువుల కట్టలపై రాకపోకలకు పాట్లు

ఐదేళ్లుగా చెరువులు, కుంటల మరమ్మతుకు నిధులు రాక కట్టలు కంపచెట్లతో అల్లుకపోయాయి. దీంతో రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. ఈ చెరువులు, కుంటల కింద మండలంలో సు మారు 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతిరోజు రైతులు ఈ చెరువులు, కుంటల కట్టలపై నుంచే తమ పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ దారుల్లో గుంతలేర్పడి వర్షాలకు నీళ్లునిలిచి బురదమడుగులుగా మారాయి. ఓవైపు కంపచెట్లు.. మరోవైపు బురదమడుగులతో చెరువులు, కుంటల ఆనవాళ్లే కనిపించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం చిన్ననీటి వనరుల నిర్వహణ నిధులను విడుదల చేసి వాటి మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చెరువుకట్ట అధ్వానంగా ఉంది



జాజిరెడ్డిగూడెంలో తీగలచెరువు అన్నిటికన్నా పెద్దది. అయితే కొన్నేళ్లుగా ఎలాంటి మరమ్మతులు లేక కంపచెట్లతో నిండి అధ్వానంగా మారింది. ఈ కట్టపై కంపచెట్లు అల్లుకపోవడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏటా మరమ్మతులు చేపట్టాలి.

– మాదగాని వెంకన్న, రైతు, జాజిరెడ్డిగూడెం

నిధులు వస్తే పనులు చేపడతాం



చెరువులు, కుంటల కట్టలపై కంపచెట్లు పెరిగి కట్టలను కమ్మేశాయి. అయితే గతంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా మండలంలో సుమారు 70 చెరువులు, కుంటల మరమ్మతు జరిగింది. అప్పటి నుంచి మళ్లీ పనులు జరగలేదు. ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం.

– హరిస్వరూప్, నీటిపారుదల శాఖ, ఏఈ

నిందితులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ కుమార్

భానుపురి : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సెంటర్ పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని, వీటి అరికట్టడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళా ముఖ్యమంత్రిగా ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్‌పై పదిమంది అత్యాచారం చేసి హత్యచేయడం దుర్మార్గమైన విషయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాసంఘాల నాయకులు గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, వీరబోయిన రమేష్, శ్రీధర్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఆలయంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న రేఖ తదితరులు

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఏర్పడిన నీటి సమస్యను రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిష్కరించనున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ చెప్పారు. అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానికులు రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయంలో నీటి సమస్య పరిష్కరించాలని కోరగా ఆమె స్పందించారు. దేవాలయంలో బోరు వేయించి ట్యాంక్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. భక్తుల కోసం ఆర్వో ప్లాంట్‌ను కూడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవసరమైన సాయం అందిస్తామని తెలిపారు. అలాగే టాయిలెట్ల నిర్మాణం కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, అర్చకుడు పవన్‌కుమార్, రాకేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం



తుంగతుర్తి : వెంపటిలో బోనాలతో మహిళలు

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి గ్రామంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు కొత్తకుండలో నైవేద్యాన్ని వండి పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరించి, డప్పుచప్పుల్ల మధ్య గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామస్తులు ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆడపడుచులు బోనాలతో వెళ్లి భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ, పోతరాజులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముక్కాల అవిలమల్లు యాదవ్, మాజీ సర్పంచ్ గుండ్ల కొమరయ్య, ముక్కాల వాసుదేవరెడ్డి, అశోక్ రెడ్డి, జలగం అచ్చయ్యగౌడ్, కోడి శ్రీనివాస్, వల్లపు శ్రీనివాస్, మద్దెల రాములు, బోమ్మెర వెంకన్న, మద్దెల భిక్షపతి, బీసు పెద్ద వీరన్న, చిన్న వీరన్న, మర్రి ఉప్పలయ్య పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామ కోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అండ



నగదు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాసం సోమయ్య–మంజుల దంపతుల కుమార్తె కాసం పావని ఇటీవల తన తల్లిదండ్రులపై ప్రత్యర్థులు దాడి చేస్తుండగా చూసి షాక్‌గురై మృతిచెందింది. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం పంపించి అండగా నిలిచారు. ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కాసం పావని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పంపించిన రూ.25వేలను కాసం సోమయ్య కుటుంబానికి అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యారాల నర్సింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పడిశాల లింగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పేరుమళ్ల రవి, తుక్కాని సోమేష్‌రెడ్డి, సంపెట అశోక్, పడిశాల వెంకటయ్య, గైగుళ్ల బయ్యన్న, తంగెళ్లపల్లి సతీష్, గైగుళ్ల లింగయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



తిరుమలగిరి: పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్



తుంగతుర్తి : పాపన్న విగ్రహం వద్ద కేక్‌కట్ చేస్తున్న గౌడ సంఘం నాయకులు

తిరుమలగిరి : సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని ఆదివారం తిరుమలగిరి, వెలిశాల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ,విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న వందల సంవత్సరాల క్రితమే పాలకులకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్యాన్ని స్థాపించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూయ రాములు,నరేష్, వీరేష్,జమ్మిలాలు,ప్రియలత రాము గౌడ్,రమేష్ గౌడ్,,జనార్దన్, లక్ష్మయ్య, కడెం లింగయ్య, వెలిశాలలో కుంభం సతీష్ గౌడ్, యాకయ్య, వెంకన్న, వేణు రెడ్డి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పబ్బు జానయ్య గౌడ్, కొండ వెంకన్న, పబ్బు సైదులు, తండు సైదులు, పనస వెంకన్న, పనస యల్లయ్య, వీరమళ్ల వెంకన్న, చిరంజీవి, తండు లక్ష్మయ్య, తండు నాగరాజు, బొమ్మగాని సాలయ్య, పబ్బు పాండు, పబ్బు అంజయ్య, పబ్బు నాగయ్య, పబ్బు సాయిలు, పబ్బు సాయి, సంతోష్, భిక్షం, నారయణ పాల్గొన్నారు.

పాపన్న సేవలు చిరస్మరణీయం

పెన్‌పహాడ్ : సర్వాయి పాపన్న చేసిన సేవలు చిరస్మరణీయమని గౌడ సంఘం అధ్యక్షుడు దేశగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కానుగు వీరస్వామి, దేశగాని నర్సయ్య, అబ్బగాని భిక్షం, కోటయ్య, కాకునూరి భిక్షం, గునగంటి ఎల్లయ్య, మామిడి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కాకునూరి దస్తగిరి, మామిడి శ్రీను, పందుల తిరపయ్య, కాశీం , మణికంఠ, పందుల వెంకన్న, పాల్గొన్నారు.

బహుజన విప్లవ వీరుడు పాపన్న

తుంగతుర్తి: ప్రపంచ తొలి బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం నాయకులు తునికి సాయిలుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కేక్‌కట్‌చేసి మాట్లాడారు. అలాగే మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో గౌడ సంఘం నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుండగాని రాములుగౌడ్, గుండగాని శ్రీనివాస్‌గౌడ్, పులుసు వెంకటనారాయణ, సుధాకర్, వర్దెల్లి లింగయ్య, వగలగాని లింగయ్య, భిక్షం, వీరభద్రం, అశోక్, నరేష్, హుస్సేన్, కంట్లం . లక్ష్మయ్య, నారాయణ, స్వామి, శ్రీకాంత్, గుండగాని దుర్గాయ్య, రమేష్, యాదగిరి, ఉప్పలయ్య, వెంకన్న, జలేందర్, శ్రీహరి, మల్లయ్య, అంజయ్య, వీరస్వామి, రవి పాల్గొన్నారు.

నాగారం : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాపన్న యువజన కమిటీ అధ్యక్షుడు బండి ఉపేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో పాపన్న జయంతి సందర్భంగా పాపన్న యువజన కమిటీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సాయి, లోకేష్, మహేష్, హరీష్, నర్సిహ్మాస్వామి, అజయ్, శ్రీను పాల్గొన్నారు.



నాగారం : నివాళులర్పిస్తున్న నాయకులు



చివ్వెంల : నివాళులర్పిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్‌లో..

మంద కృష్ణమాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎస్సీ వర్గీకరణ సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిన మంద కృష్ణమాదిగను హైదరాబాద్‌లో తిరుమలగిరి ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమయ్య, ఎంపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. సోమయ్య, రాంబాబు, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న తోటి స్నేహితులు

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన బోయిళ్ల చంద్రశేఖర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు.మండల కేంద్రానికి చెందిన క్రీడా, ఉద్యోగ, విద్యావంతుల సంఘాలు, బాల్య స్నేహితులు, వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులు, స్ఫూర్తి యూత్, ప్రతినిధులు ఆదివారం చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా రూ. 1.57లక్షల ఆర్థిక సహాయం అందించారు. చంద్రశేఖర్ కుమారుల ఉన్నతికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైమద్, వీరన్న, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవ్, వీరారెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, లతీఫ్, ఫరీద్, ప్రసాద్, కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో రక్షాబంధన్ సందడి



అర్వపల్లి : రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అర్వపల్లి: రాఖీ పౌర్ణమి వేడుకల సందడి ఆదివారం అర్వపల్లిలో కనిపించింది. మహిళలు రాఖీల కొనుగోలు చేశారు. అర్వపల్లిలో వైజంక్షన్, తుంగతుర్తి రోడ్డు, దేవాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో రాఖీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. ఈ సెంటర్‌లలో మహిళలు రాఖీలు, మిఠాయిలు కొనుగోలు చేశారు. అలాగే రెండు జాతీయ రహదారులపై వెళ్లే ప్రయాణికులు కూడా ఆగి రాఖీలను కొనుగోలు చేసుకెళ్లారు. దీంతో జంక్షన్‌లో రాఖీల సందడి నెలకొంది.



అర్వపల్లి దేవాలయం ఎదుట రాఖీల విక్రయాలు

అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్



తుంగతుర్తి: మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడిగా కొండగడ్పుల ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా మల్లెపాక సైదులు, ప్రధాన కార్యదర్శిగా బంగారి మనోజ్, కోశాధికారిగా ఇమ్మడి శ్రీకాంత్, గేమ్స్ సెక్రటరీగా బొంకూరి మనోజ్, కల్చరల్ సెక్రటరీగా మరికంటి అశోక్, కత్తుల నరేందర్, మల్లెపాక రాంబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న రేఖ, ఫౌండేషన్ సభ్యులు

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన సాయిని ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆదివారం రాత్రి రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ ముత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, మాజీ ఎంపీటీసీ కుంభం మధు, రాజశేఖర్, శివ, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంట జయంత్ అత్త మడిపెద్ది పద్మ ఇటీవల మృతిచెందారు. ఆదివారం అర్వపల్లిలో పద్మ చిత్రపటానికి డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి నివాళులర్పించి మృతురాలి కుటుంబీకులకు రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించినవారిలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, కృష్ణమూర్తి, బన్ని, సందీప్, రవి, మహేష్, యాదగిరి, అనిల్, రాజ్‌కుమార్, నాగరాజు, బద్రి, సురేష్, మహేష్, మధు, రాంప్రసాద్, మల్లేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాలలు

- మద్యం సేవిస్తూ సీసాలు పగులగొడుతున్న వైనం
- పాఠశాలల్లో సామగ్రి ధ్వంసం



పాతర్లపహాడ్ స్కూల్‌లో మద్యం బాటిళ్లు



గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టిన పైప్‌లైన్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : సరస్వతీ నిలయాలు మందుబాబులకు, అరాచక వాదుల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా నిలుస్తున్నాయి. కొందరు యువకులు పాఠశాలల్లో మందు, సిగరెట్లు తాగుతూ వస్తువులను పగలగొట్టడం, విరగ్గొట్టడం చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుస్తున్నారు. మండల వ్యాప్తంగా పాఠశాలల్లో నైట్ వాచ్ మెన్లు లేకపోవడంతో రాత్రిపూట యువకులు తమ కార్యకలాపాలకు వీటిని వాడుకుంటున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రతిరోజు పాఠశాలలో మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. తాగిన మైకంలో యువకులు పాఠశాలల్లో సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు చోరీలకు కూడా పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం కందగట్ల పాఠశాలలో దొంగతనం చేసి విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను అపహరించారు. ఇటీవల మండల పరిధిలోని పాతర్లపాడు ప్రాథమిక పాఠశాలలో రాత్రిపూట తాగిన మద్యం బాటిళ్లు, వాటర్ బాటిల్లు వదిలేసి వెళ్లారు. దాంతోపాటు విద్యార్థులకు నీటి వసతికి ఏర్పాటు చేసిన పైపులైన్లను ధ్వంసం చేశారు. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా స్థానికులు బయట పెట్టడం లేదు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు అందుబాటులో ఉండటంతోనే యువత పెడదారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పాఠశాలల్లో రాత్రిపూట యువకులు మద్యం సిగరెట్లు తాగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువతలో మార్పు రావాలి



గ్రామ యువతను చూస్తే భయమేస్తోంది. చదువుకున్న బడుల్లో వస్తువులు పగులగొట్టడం, మద్యం సేవించడం సరికాదు. చదువుకున్న బడిని పాడు చేయడం అంటే మన విలువను మనమే పోగొట్టుకోవడం. ఇకనైనా యువతలో మార్పు రావాలి. ఒక్కసారి బడి మాత పడితే పిల్లలు ఊర్లు పట్టుకొని తిరిగి చదువుకోవాల్సి వస్తుంది.

– ఇరుగు మధుకర్, పాతర్లపహాడ్